క్లుప్తంగా

సితార్ విద్వాంసుడు జనార్దన్‌కు అవార్డు ప్రదానం



విద్యారణ్యపురి: ప్రముఖ సితార్ విద్వాసుడు గుమ్మడి జనార్దన్‌కు హనుమకొండకు చెందిన వేదాంతం నరహరచార్య – కాంతమ్మ స్మారక అవార్డును నిర్వాహకులు వేదాంతం లక్ష్మమ్మ, శ్రీదేవి, వి.కృష్ణమాచార్య, జయశ్రీ అందజేశారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ రజోత్సవాల ముగింపు సభలో పాల్గొన్న గుమ్మడి జనార్దన్‌కు స్మారక అవార్డును శనివారం రాత్రి అందజేశారు. ఈ అవార్డు కింద జనార్దన్‌కు రూ.10 వేల నగదు బహుమతి అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర రంగస్థల అభివృద్ధి కమిటీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, సహృదయ సంస్థ అధ్యక్షుడు గిరిజామనోహర్‌బాబు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎన్‌వీఎన్.చారి, బాధ్యులు వనం లక్ష్మీకాంతారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వీరేందర్‌కుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు పి.వీరేందర్‌కుమార్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. లైఫ్ టూ లాంగ్వేజ్ అండ్ లాంగ్వేజ్ టూ లైఫ్ రామాచంద్రమౌళిస్ వర్క్స్ ఇన్ ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వీరేందర్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపాజ్యోతి పర్యవేక్షణలో వీరేందర్‌కుమార్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

శిరీషకు ఎంఫిల్ డిగ్రీ..



కాకతీయ యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు పి.శిరీషకు ఎంఫిల్ డిగ్రీ ప్రదానం మల్లారెడ్డి తెలిపారు. ఎంప్లాయి జాబ్ సాటిస్ఫాక్షన్ ఇన్ షీటీమ్స్ అండ్ భరోసా ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శిరీషకు ఎంఫిల్ డిగ్రీ ప్రదానం చేశారు. ఆ విభాగం ప్రొఫెసర్ యాదగిరిరావు పర్యవేక్షణలో ఆమె తన ఎంఫిల్ పూర్తిచేశారు.

సోమిడి శివాలయంలో మహా అన్నదానం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి సోమేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ఆదివారం మహాన్నదానం చేశారు. ప్రతిఏటా క్రమం తప్పకుండా మహాశివరాత్రి పర్వదినం ముగిసిన అనంతరం అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల శివకుమార్, పిల్లల సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో..



కాజీపేట అర్బన్: శివరాత్రి పండుగ సందర్భంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో అన్నదానం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాసశర్మ తెలిపారు.

హుండీ లెక్కింపు



కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం లెక్కించారు. మొత్తం రూ.3,24,819 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. అలాగే, 11 డాలర్లు కూడా వచ్చాయని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, ఓరుగంటి కొమురయ్య, మామిడి ఈశ్వరయ్య, బోడకుంట్ల వైకుంఠం, బిట్ల చక్రపాణి, బరుపాటి జోగయ్య, నాంపెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సగంలోనే వదిలేశారు..!

- రెండేళ్లైనా పూర్తికాని క్రిస్టియన్ కాలనీలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పందులు, ఈగలు, దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు (ఫైల్), ఇన్‌సెట్‌లో రెండేళ్ల నాటి శిలాఫలకం

కాశిబుగ్గ: అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో 18వ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. క్రిస్టియన్‌కాలనీలోని పార్కు స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, మరుగు దొడ్లు, ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టి రెండేళ్లు కావస్తున్నా అవి పూర్తి కాలేదు. చెత్తాచెదారం పేరుకుపోయి పందులు, ఈగలు, దోమల బెడద అధికమైందని దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలని కాలనీవాసులు ఇటీవల నిరసన కూడా తెలిపారు.

అసంపూర్తిగా పనులు

క్రిస్టియన్‌కాలనీలోని పార్కు స్థలంలో 2021, ఫిబ్రవరి 10న రూ. 46 లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వ్యయంతో కమ్యూనిటీ హాల్‌తో పాటు ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మాణ పనులకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు. టెండర్ దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ నిర్మాణాలను చేపట్టి అసంపూర్తిగా నిర్మించి వదిలేశాడు. రెండేళ్లు కావస్తున్నా పనులను పూర్తి చేయలేదు. పనులు అసంపూర్తిగా ఉండడంతో చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయి ఈగలు, దోమలు, పందుల బెడద అధికమైంది. దాంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు తెలుపుతున్నారు.



తచ్చాడుతున్న పందులు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రికెట్ పోటీలు



టాస్ వేస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

కేయూ క్యాంపస్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ తెలిపారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్‌వీ), కాకతీయ క్రికెట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కొనసాగుతున్నాయి. మూడవ రోజు ఆదివారం క్రికెట్ పోటీలను వినయ్‌భాస్కర్ టాస్ వేసి, బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓరుగల్లు క్రీడలకు పుట్టినల్లు అని, ఓరుగల్లు నుంచి అనేకమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతిఏడాది పశ్చిమ నియోజకవర్గంలోని యువతకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫారూఖ్, నాయకులు వీరేందర్, రాకేష్, పరశురాములు, రాంబాబు, తిరుపతి, నరేంద్ర, నాగరాజు, ప్రవీణ్, స్నేహిత్, రోహిత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఎలక్ట్రానిక్ మీడియా టీమ్, ప్రింట్ మీడియా జట్టు, డాక్టర్ టీమ్, పోలీస్ డిపార్టుమెంట్ టీమ్, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ జట్టు, కార్పొరేటర్ల టీమ్, డివిజన్ అధ్యక్షుల జట్టు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుల టీమ్, ఎలక్ట్రానిక్స్ యూనియన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించి ఎలక్ట్రానిక్ మీడియా, పోలీస్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయని బీఆర్ఎస్‌వీ నాయకుడు వీరేందర్ తెలిపారు.

కారు ఢీకొని 20గొర్రెల మృత్యువాత



మడికొండ: రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని 20 గొర్రెలు మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాంపూర్ గ్రామానికి చెందిన కన్నెబోయిన సంపత్‌కు చెందిన గొర్రెలను రోజులాగే మేతకు తరలిస్తుండగా ఆదివారం ఉదయం ఔటరింగ్ రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి వేగంగా వచ్చిన కారు వాటిని ఢీకొట్టింది. దాంతో 20గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. కాగా, సంఘటన స్థలాన్ని చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ధర్మసాగర్ పోలీసులు తెలిపారు.

రైతుల భూములకు పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఖిలా వరంగల్: పడమర, మధ్యకోట వ్యవసాయ భూములకు పట్టాలు ఇవ్వకుండా రైతులకు రైతుబంధు పథకాన్ని దూరం చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పట్టాలు ఇవ్వాలని బీజేపీ నాయకుడు అచ్చ విద్యాసాగర్ డిమాండ్ చేశారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన మ్యూజియం భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్‌లో పుప్పాల ప్రవీణ్, సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్ అధ్యక్షతన ప్రజా గోస – బీజేపీ భరోసా శక్తి కేంద్రం కార్నర్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యాసాగర్ మాట్లాడుతూ అగర్త రోడ్డును పూర్తి చేయాలని, గల్లీగల్లీలో ఉన్న బెల్ట్ షాపులను మూసివేయాలని కోరారు. బొడ్రాయి సమీపంలో ఉన్న చిల్డ్రన్స్ పార్కును అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మార్టిన్ లూథర్, దేవేందర్, త్రిలోకేశ్వర్, చంద్రమోహన్, పూర్ణచందర్, శ్రీను, రాజు, నందు, అశోక్, సతీష్, కిరణ్ పాల్గొన్నారు.

శోభారాణి మరణం సాహితీ లోకానికి తీరని లోటు



శోభారాణికి నివాళులర్పిస్తున్న కవులు

హన్మకొండ కల్చరల్: కందాల శోభారాణి మరణం ఓరుగల్లు సాహితీ లోకానికి తీరని లోటని, అద్భుతమైన కవితలు వినిపించే ఆమె స్వరం మూగబోయిందని ప్రముఖ కవి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి అన్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని సాహితీ సంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో కవయిత్రి డాక్టర్ కందాల శోభారాణి స్మరణసభ బాలసముద్రంలోని ఆదర్శ లా కళాశాలలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పలువురు సాహితీవేత్తలు, కవులు, శోభారాణి భర్త తాటిపాముల రమేష్, కుమారుడు కౌశిక్ పాల్గొని శోభారాణి చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనం పాటించారు. అనంతరం కవులు వారి కవితల ద్వారా ఆమెకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కవులు మాట్లాడుతూ శోభారాణి తన పార్థివదేహాన్ని విద్యార్థుల ప్రయోగాల నిమిత్తం కాకతీయ మెడికల్ కళాశాలకు అందించడం ఆమె సమాజసేవకు నిదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు మహమ్మద్ సిరాజుద్దీన్, సభ్యులు శనిగరపు రాజమోహన్, అరసం జిల్లా అధ్యక్షుడు నిధి బ్రహ్మాచారి, విరసం జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత, తెలంగాణ సాహితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కోగిల చంద్రమౌళి, వరసం జిల్లా అధ్యక్షుడు నల్లెల రాజయ్య, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల, ఎర్ర విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: వినియోగదారులు ఫిర్యాదు చేసిన వెంటనే వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని కన్జ్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మొగలిచెర్ల సుదర్శన్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సంఘాల సమాఖ్య కార్యాలయంలో హైకోర్టు న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన న్యాయ సలహా సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి డెస్క్, న్యాయ సలహా కమిటీని సీసీఐ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీనికి చీఫ్‌గా ప్రభుత్వ అదనపు న్యాయవాది విజయ్‌కుమార్ వ్యవహరిస్తారని చెప్పారు. త్వరలోనే విధివిధానాలు ఖరారవుతాయని అన్నారు. అనంతరం ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో గ్రామ సభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. ఆ దిశగా వినియోగదారుల సంఘాలు.. పట్టణాల్లో డివిజన్, గ్రామ స్థాయిలో గ్రామ సభలు నిర్వహించి స్వయంగా సమస్యలు పరిశీలించి న్యాయ స్థానాల ముందుంచినప్పుడు కాలాతీతం కాకుండా సమస్యలు సత్వరమే పరిష్కరించబడుతాయిని సూచించారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బండి అనిల్‌కుమార్, రాయబారపు భిక్షపతి, రంగరాజు ఆనందరావు, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ చంద్రకాంత్, ముత్యాల రమేష్, రాజేష్, శశికాంత్ పాల్గొన్నారు.

వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై చీఫ్‌విప్ పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న చీఫ్‌విప్ దంపతులు

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ శివారులోని వడ్డెపల్లి ట్యాంక్‌బండ్‌పై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ – రేవతి దంపతులు ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మహాశివుడికి వారు రుద్రాభిషేకం జరిపించారు. కాగా, చీఫ్‌విప్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోళ్ల వాణి, కుమార్, కార్పొరేటర్ ఎలకంటి రాములు, మర్యాల కృష్ణ, వెంకటస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ పార్టీలో యువత చేరుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. ఒకటవ డివిజన్ చిన్న గుంటూరుపల్లికి చెందిన పలు పార్టీలకు చెందిన వడిచర్ల నవీన్‌రెడ్డి, గాదె అమరేందర్‌రెడ్డి, మహ్మద్ అయాజ్, వంశీ, చందు, ఉదయ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆదివారం ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గనిపాక విజయ్, కల్పన, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో శ్మశాన వాటిక

ప్రతి గ్రామంలో శ్మశాన వాటికల నిర్మాణం చేపడుతున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఒకటవ డివిజన్ భీమారం శివారులో నిర్మించిన శ్మశాన వాటికను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో సర్కారు స్థలాలు ఉంటే శ్మశాన వాటికల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ డివిజన్ ప్రచార కార్యదర్శులు చకిలం చంద్రశేఖర్, తోట నాగరాజు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కడియం కృష్ణయ్యకు పలువురి నివాళి



కృష్ణయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సోదరుడు కడియం కృష్ణయ్య దశ దినకర్మ ఆదివారం హనుమకొండ నిట్ సమీపంలోని మయూరి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈమేరకు కడియం శ్రీహరిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి: సీతాలక్ష్మణహన్మత్ సమేత రామచంద్ర స్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్లు శ్రీరామ సేవా సమితి సభ్యులు తెలిపారు. హసన్‌పర్తిలోని ఆర్టీసీకాలనీలో ఉత్సవాలు జరుగుతాయని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేడుకలకు భక్తులు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈనెల 21న సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం 6గంటలకు విశ్వక్సేన ఆరాధన అంకురార్పణ, మృత్సంగ్రహణం, రక్షా బంధనం, తీర్థప్రసాద గోష్ఠి, 22న ఉదయం బాలభోగం, యాగశాలలో ద్వారతోరణ, ధ్వజ కుంభారాధన, చతుష్టానార్చన, హోమం, జలాధివాసం, ఉత్సవ మూర్తులకు ధాన్యాధివాసం, నిత్యపూర్ణాహుతి, 23న హోమం, ఉత్సవమూర్తులకు ఫల, పుష్ప దివాసం, నిత్యపూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి, 24న మహాపూర్ణాహుతి, ఉత్సవమూర్తుల ప్రతిష్ఠాపన, శాంతి కల్యాణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీరామ సేవా సమితి సభ్యులు వివరించారు.

ఛత్రపతి శివాజీ జీవితం ఆదర్శం



ఖిలా వరంగల్: శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కాజీపేట అర్బన్: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో నిట్ విద్యార్థులు, అధ్యాపకులు



కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో..

ఖిలా వరంగల్: ఛత్రపతి శివాజీ జీవితాన్ని ఆరె కులస్తులు స్ఫూర్తిగా తీసుకుని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పకిడె సాంబరావు సూచించారు. శివాజీ 393వ జయంతిని వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పలు డివిజన్లతోపాటు ఏకశిలనగర్‌లో ఆరె సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. అనంతరం సాంబరావు మాట్లాడుతూ ఆరె కులస్తులు ఐక్యతతో సంఘటితమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. శివాజీ పోరాట స్ఫూర్తిని చాటాలని కోరారు. కార్యక్రమంలో లింగారావు, రమేష్, నవీన్, మోర్తాల యాకయ్య, రవి, శ్రీధర్, వినోద్, కర్నాకర్, బాబురావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నిట్‌లో ఛత్రపతి శివాజీ జయంతి

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ పులి రవికుమార్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ మహరాజ్ నాయకత్వ లక్షణాలను కొనియాడారు. ఆయన పోరాటాలు నేటితరానికి ఆదర్శం అని రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శివాజీ యువ ఫౌండేషన్ కన్వీనర్ శివశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల తెలుగు విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్ మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన వీర యోధుడు శివాజీ అని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రమేష్, సుధాకర్, శివాజీ యువ ఫౌండేషన్ బాధ్యులు జితేంద్ర, ఎస్‌కె.సలీం పాషా, సుధాకర్, సాయి, చరణ్, తెలంగాణ బహుజన విద్యార్థి పరిషత్ అధ్యక్షుడు వెంకట్ పాల్గొన్నారు.

కాశిబుగ్గలో..

కాశిబుగ్గ: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఆరె సంక్షేమ సంఘం అర్బన్ జిల్లా ప్రెసిడెంట్ గుండెకారి జగన్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గద్దం యుగేందర్ గౌడ్, నీలం శ్రీధర్, పూర్ణేందరెడ్డి, మోహన్‌రావు, శ్రీను, లవన్, తిరుమల్, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.



కాజీపేట బాపూజీనగర్‌లో శివాజీ శోభాయాత్ర

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ వరంగల్ పార్లమెంటరీ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు హరిశంకర్, నాయకులు సాయి, శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.



కాశిబుగ్గ జంక్షన్‌లో..



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు



గుండ్ల సింగారంలో..

నిలిచిన భూమి కొనుగోలు పథకం

- ధరలు పెరగడంతో అమ్మకానికి ముందుకురాని రైతులు

వరంగల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం భూమి లేని నిరుపేద దళిత మహిళల ఆర్థిక స్థితిని మార్చడానికి ప్రభుత్వం మూడు ఎకరాల భూమి కొనుగోలు పథకం ప్రారంభించింది. 2014 సంవత్సరంలో ప్రారంభించిన పథకాన్ని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పథకాన్ని అమలు చేసింది. 2014–15 సంవత్సరంలో భూమి కొనుగోలు పథకం ఎస్సీ వార్షిక కార్యాచరణలో భూములు అమ్మడానికి ముందుకు వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. గ్రామాల్లోకి వెళ్లి భూములు అమ్మడానికి ముందుకు వచ్చే రైతులతో చర్చించి భూముల కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎకరాకు రూ.3లక్షల చొప్పున చెల్లించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డబ్బులు చెల్లించేందుకు నిర్ణయించారు. అయితే, ప్రస్తుతం భూములకు మంచి డిమాండ్ రావడంతో సదరు రైతులు తమ భూములు అమ్మడానికి ముందుకు రావడం లేదు.